నకిలీ ప్రెస్ కార్డులతో బెదిరిస్తే చర్యలు

మియాపూర్, జూలై 11: నకిలీ ప్రెస్ కార్డులతో కొందరు భవన నిర్మాణ దారులను బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని మియాపూర్ ఏసీపీ నర్సింహారావు హెచ్చరించారు. యూట్యూబ్‌ల పేరిట, ట్రూ కాలర్‌లలో జీహెచ్ఎంసీ విజిలెన్స్ అధికారుల పేరిట నిర్మాణదారులను డబ్బులు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని, ఇప్పటికే వారిని గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కొందరు రాజకీయ నేతల పేరిట ఈ తతంగానికి పాల్పడుతున్నారని, ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడే వారికి ఉపేక్షించబోమని, నూతన చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ స్పష్టం చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

దుండిగల్, జూలై 11: నగరంలోని వివిధ రేషన్ దుకాణాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలిస్తుండగా దుండిగల్ పోలీసులు, ఎస్‌వోటీ పోలీసులతో కలిసి పట్టుకున్నారు. సుమారు 29 టన్నుల బియ్యంతో పాటు లారీని సీజ్ చేశారు. లారీ డ్రైవర్‌తో పాటు క్లీనర్‌ను అదుపులోకి తీసుకోగా.. ఈకేసుతో సంబంధం ఉన్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఎస్ఐ.శంకర్ తెలిపిన ప్రకారం... దుండిగల్‌లోని ఔటర్‌రింగ్‌రోడ్డు ఎగ్జిట్/ఎంట్రీ ద్వారా ఓ లారీలో పీడీఎస్(రేషన్)బియ్యం తరలిస్తున్నట్లు దుండిగల్, మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో గురువారం ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద పోలీసులు కాపుకాయగా మహారాష్ట్రకు చెందిన లారీ అనుమానాస్పదంగా కనబడటంతో ఆపి తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యం బ్యాగులు ఉన్నాయి. మొత్తం 29 టన్నుల 2 క్వింటాళ్ల 40 కిలోల బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో లారీ డ్రైవర్ మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన షేక్ దస్తగిరి(25), క్లీనర్ షేక్ రిజ్వాన్(24) లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ బియ్యాన్ని మలక్‌పేట్‌లోని మెట్రో పిల్లర్ నం.1390 వద్ద లోడ్ చేసినట్లు తేలింది. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇమ్రాన్, ఆహ్మద్ హూస్సేన్‌తో పాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

స్వరూప(ఫైల్)

కుత్బుల్లాపూర్, జూలై 11: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం... జీడిమెట్ల జయరాంనగర్ ప్రాంతానికి చెందిన ఊర ఖాశీరాం భార్య ఊర స్వరూప(22) స్థానికంగా ఉన్న ఓ స్వీట్‌కంపెనీలో పనిచేస్తున్నది. రోజువారి పనిలో భాగంగా పనికి వెళ్లిన ఆమె రాత్రి అయినా తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఖాశీరాం భార్యకు ఫోన్ చేయగా స్వీచ్‌ఆఫ్ రావడంతో కంపెనీ వద్దకు వెళ్లి ఆరా తీయగా పనికి రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కలతోపాటు బంధువులు, తెలిసిన వారికి వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు ఆత్మహత్య

దుండిగల్, జూలై11 : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ, తెలుగుతల్లినగర్‌కు చెందిన జ్యోతుల నాగరాజు(29), అదే ప్రాంతానికి చెందిన మమతలు ఏడాది కిందట ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. నాగరాజు దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని గ్లాండ్‌ఫార్మా పరిశ్రమలో పనిచేస్తుండగా, మమత గృహిణి. నాగరాజుకు తల్లిదండ్రులు లేకపోవడంతో అతని అమ్మమ్మ కనకమ్మ పెంచి పెద్ద చేసింది. నాగరాజు దంపతులు సైతం కనకమ్మ వద్దనే ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సమారు రూ.7లక్షలు అప్పు చేశాడు. భార్య నెక్లెస్‌ను ఇటీవల కుదువపెట్టాడు. ఈ విషయమై బుధవారం ఉదయం కనకమ్మ, మమత, నాగరాజు మధ్య గొడవ జరిగింది. అయితే రాత్రి 8 గంటల సమయంలో సూరారం కాలనీరోడ్డులో నివాసం ఉంటున్న మమత తల్లిగారింటికి వెళ్లిన నాగరాజు ఓ గదిలో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న భార్య మమత స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి నాగరాజును చికిత్స కోసం ఓ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందులతో భర్త ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు


జింకలవాడ, ప్రభాకర్‌రెడ్డినగర్ బస్తీల సరిహద్దులలో ప్రభుత్వ భూమికి బౌండరీలు వేయాలని రెవెన్యూ అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బాలానగర్, జూలై 11 : ప్రభుత్వ భూములను కాపాడటంలో రెవెన్యూ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాలానగర్ తహసీల్దార్‌కు సూచించారు. గురువారం జింకలవాడ, ప్రభాకర్‌రెడ్డినగర్ బస్తీల సరిహద్దులలో ఉన్న ప్రభుత్వ భూమిని డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, రెవెన్యూ అధికారులు, స్థానికులతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జింకలవాడ, ప్రభాకర్‌రెడ్డినగర్ బస్తీ సరిహద్దులలో ఉన్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తక్షణమే సర్వే చేయించి బౌండరీలు వేయాలని సూచించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ భూమిపై నిరంతర నిఘా ఉండటం కోసం రెవెన్యూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందంటే అది పూర్తిగా అధికారుల వైఫల్యం వల్లనే జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూములు ఎక్కడైనా సరే ఆక్రమణలకు గురైతే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. ఆయా ప్రాంతాల ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించినప్పుడే అధికారులు కూడా ఆ దిశగా అడుగులు వేస్తారని తెలిపారు.

ప్రజలకు ఉపయోగపడేలా కమ్యూనిటీహాల్ నిర్మాణం

ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మియాపూర్, జూలై 11: కాలనీ ప్రజల అవసరాలు తీరేలా కమ్యూనిటీహాల్‌ను నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఇప్పటికే పలు కాలనీల్లో సౌకర్యవంతమైన హాళ్లు చక్కగా ఉపయోగపడుతున్నాయన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలోని కృష్ణనగర్ కాలనీ, న్యూసైబర్ వ్యాలీ కాలనీల్లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే గాంధీకి ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తన సంపూర్ణ తోడ్పాటును అందిస్తానన్నారు. కాలనీ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి అభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, నర్సింగరావు, వెంకటేశ్ , వెంకటరెడ్డి, వీరభద్ర, సూర్యనారాయణ, అశోక్ పాత్రో, ఫణిరాజు, రాజా, కృష్ణారావు, మంగేశ్ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకుందాం..

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ బండ ప్రధాన రహదారిలో నిర్వహించిన వన మహోత్సవంలో కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. *– మియాపూర్, జూలై 11*

రైతు మృతికి కారణమైన వారిని శిక్షించాలి

దుండిగల్, జూలై 11 : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బొరంపేట్‌లో బుధవారం మరణించిన రైతు కృష్ణారెడ్డి మృతికి కారణమైన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేశ్ డిమాండ్ చేశారు. బొరంపేటకు చెందిన వంపుగూడెం మాధవరెడ్డి భూ వివాదం నేపథ్యంలో సోమవారం రాత్రి ఇల్లు విడిచి వెళ్లగా వేదనతో అతని తండ్రి కృష్ణారెడ్డి బుధవారం గుండెపోటుతో మరణించిన విషయం విదితమే. గురువారం మాధవరెడ్డి ఇంటికి వెళ్లిన సీపీఐ నేతలు ఆయనను పరామర్శించడంతోపాటు ధైర్యంగా ఉండి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. సీపీఐ నియోజకవర్గ నాయకులు శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, యాదయ్య, ఆంజనేయులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ముగిసిన అంత్యక్రియలు..

కాగా త్రిపుర ల్యాండ్ మార్క్ కన్‌స్ట్రక్షన్స్ యజమాని సుధాకార్, నిజాంపేట్‌కు చెందిన ఓ కార్పొరేటర్ వేధింపులతో రెండురోజుల పాటు అజ్ఞాత వాసంలోకి వెళ్లిన వంపుగూడెం మాధవరెడ్డి గురువారం జరిగిన తన తండ్రి కృష్ణారెడ్డి అంత్యక్రియలకు హాజరయ్యారు. దీంతో గ్రామస్తులతోపాటు కుటుంబసభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫుడ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్‌లో హైదరాబాద్ 5వ స్థానం

ఫుడ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్‌లో హైదరాబాద్ నగరం 5వ స్థానంలో నిలిచిందని నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ చాప్టర్ హెడ్ శ్రీనివాస్ సంపత్ అన్నారు. గురువారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన 'నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' 5వ ఎడిషన్ సదస్సులో ఆయన పాల్గొని చెఫ్ శంకర్, సందీప్ బాలసుబ్రమణ్యన్, కవిత మంత, ఫైజల్ తయబలి, సరిత సర్కార్‌లతో కలిసి 5వ ఎడిషన్ ఫుడ్ సర్వీసెస్ వివరాలతో కూడిన రిపోర్టు కాపీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ సంపత్ మాట్లాడుతూ... ఫుడ్ సర్వీసెస్ ఇండస్ట్రీస్‌లో హైదరాబాద్ నగరం 5వ స్థానంలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో అత్యధిక ఉద్యోగులను కలిగిన ఇండస్ట్రీగా ఫుడ్ సర్వీసెస్ ఇండస్ట్రీ రెండవ స్థానానికి చేరిందని, 2028 కల్లా మరింత ఉద్యోగులను కలిగి ఉంటుందన్నారు. *– కొండాపూర్, జూలై 11*

ఆత్మహత్యా..?హత్య చేశారా..?

- అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి...
- దుండిగల్ పీఎస్ పరిధిలో ఘటన

పవన్‌కల్యాన్(ఫైల్)

దుండిగల్, జూలై 11: ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అయితే ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడా?లేక ఎవరైనా కొట్టి చంపారా..? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని దుండిగల్ తాండా-1కు చెందిన బానోతు మోహన్‌నాయక్, అనిత దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు బానోతు పవన్‌కల్యాన్(24), సిద్దు నాయక్, కూతురు స్వాతి ఉన్నారు. మోహన్ నాలుగేండ్ల కిందటే చనిపోయాడు. అప్పటి నుంచి తాండా-1లో ఉన్న కుటుంబం 4 నెలల కిందట డీ.పోచంపల్లి పరిధిలోని సారిగూడెంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. మోహన్ కుటుంబానికి దుండిగల్ తాండాలోని సర్వే నం.148, 150లోని 14 గుంటలు, సర్వే నం.158లోని 17 గుంటల సొంత భూమి ఉన్నది. అయితే ఈ విషయంలో గత కొంతకాలంగా వివాదం నడుస్తున్నట్లు తెలుస్తున్నది. ఈ విషయమై గత రాత్రి నలుగురు వ్యక్తులు స్థానికంగా ఉండే కల్లు కాంపౌండ్ దగ్గరకు పవన్ కల్యాన్‌ను పిలిచి గొడవకు దిగినట్లు తెలుస్తున్నది. ఆ సమయంలోనే డబ్బుల విషయంలో తమ్ముడు సిద్ధునాయక్‌కు మృతుడు పవన్‌కల్యాన్ మధ్య గొడవ జరిగినట్లు స్థానికులు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో పవన్‌కల్యాన్ గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పవన్‌కల్యాన్ చీరతో ఉరేసుకుని మృతి చెందాడని చెబుతున్నప్పటికీ పోలీసులు సీన్‌కు వెళ్లేలోగా దానిని విప్పదీసి ఉంచడం, తలకు బలమైన గాయం ఉండటం అనుమానాలకు తావిస్తోంది. ఈ క్రమంలో పవన్ కల్యాన్‌ను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారా..? నిజంగానే అతను ఆత్మహత్య చేసుకున్నాడా? అనే అనుమానాలు కూడా రేకెత్తుతున్నాయి. ఒకవేళ ఆత్మహత్య చేసుకుని ఉంటే అంతలా ఇబ్బందులు అతనికి ఏమి ఉన్నాయనేది స్థానికులు అంటున్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అయితే అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు దుండిగల్ సీఐ శంకరయ్య తెలిపారు. పోస్టుమార్టం రిపోర్ట్ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని ఆయన స్పష్టం చేశారు.

డెంగీ నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి: జడ్సీ ఉపేందర్‌రెడ్డి

డెంగీ నివారణపై అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

మియాపూర్, జూలై 11 : వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యంపై శ్రద్ధ వహించాలని, వ్యాధులు ప్రబలకుండా చూడాలని శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి సూచించారు. అత్యంత ప్రధానంగా ఈ సీజన్‌లో డెంగీ నిర్మూలనకు పటిష్టమైన చర్యలను చేపట్టాలని, పారిశుధ్య ఎంటమాలజీ సహా అనుబంధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. డెంగీ నివారణపై జోనల్ స్థాయి సమీక్ష సమావేశాన్ని జడ్సీ ఉపేందర్‌రెడ్డి గురువారం తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్కిళ్లలో డెంగీ పట్ల ప్రజలను అప్రమత్తం చేయటంతోపాటు తగు అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ప్రభుత్వేతర విద్యాసంస్థల్లోనూ ప్రచారం చేపట్టాలని జడ్సీ సూచించారు. వర్షపు, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సెల్లార్‌లు, వర్షపు నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి తక్షణమే ఎంటమాలజీ సిబ్బందికి సమాచారం అందించాలని, దోమల వ్యాప్తి నివారణకు తగు ఫాగింగ్‌తో పాటు సంబంధిత చర్యలను నిర్లక్ష్యం చేయవద్దని జడ్సీ స్పష్టం చేశారు. బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు దవాఖానలను డీసీలు, వైద్యాధికారులు, ఏఈలు, సందర్శిస్తూ జ్వరం కేసుల నమోదుపై ఆరా తీయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీ కృష్ణ, సురేశ్, నాయక్, వైద్యాధికారులు, డీపీ ఓలు, ఎంటమాలజీ విభాగం, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- శేరిలింగంపల్లి జోన్‌లో జడ్సీ ఉపేందర్‌రెడ్డి గురువారం పర్యటించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో గోపన్‌పల్లిలోని శునకాల పెట్టర్, క్రిమిటోరియం, గోపన్‌పల్లిలోని హుడా కమ్యూనిటీహాల్‌తోపాటు పరిసర ప్రాంత రహదారులపై పారిశుధ్య నిర్వహణ తీరును కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి జడ్సీ పరిశీలించారు. వీధి శునకాల స్టెరిలైజేషన్ ప్రక్రియను డీడీ విల్సన్, అబ్దుల్ బాసిత్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చందానగర్ సర్కిల్ పరిధిలోని ఆర్‌టీసీ కాలనీలో ఆర్‌వోబీ రోడ్డును డీసీ వంశీకృష్ణ, కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి పరిశీలించారు. ఆర్‌వో విస్తరణలో ఆస్తులు ప్రభావితం అయ్యే యజమానులతో కలిసి ఆర్‌వోబీని రీ అలైన్‌మెంట్ చేయాలని కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్ జడ్సీని కోరారు. ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హుడాకాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నలగండ్లలో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్టు వెస్ట్‌జోన్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డితో కలిసి నలగండ్ల హుడాకాలనీలో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలపై పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం, అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం, విద్యుత్ సమస్యలను కాలనీవాసులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలోని పార్కు స్థలంలో ఓపెన్‌జిమ్, చిల్డ్రెన్స్ పార్క్ పరికరాలు, క్రీడా ప్రాంగణం, కమ్యూనిటీ హాలు మరమ్మతులకు కృషి కోరారు. జడ్సీ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలకు కాలనీవాసులు వినతిపత్రాలు అందజేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ రజనీకాంత్ రెడ్డి, డీఈ విశాలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

హరినాథ్(ఫైల్)

కుత్బుల్లాపూర్,జూలై11: వసతి భవనంపై నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ బీఎస్సీ విద్యార్థి హరినాథ్(22) కొంపల్లిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు హరినాథ్ మైసమ్మగూడలోని ప్రైవేట్ వసతి గృహంలో తోటి విద్యార్థుల ర్యాగింగ్‌తోనే గడ్డికి పిచికారీ చేసే మందు సేవించి ఆపై భవనం పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రసాయనాల వ్యర్థాల ట్యాంకర్ పట్టివేత

ట్యాంకర్ సీజ్.. ఇద్దరిపై కేసు

దుండిగల్, జూలై 11:సరైన పత్రాలు లేకుండా రసాయన వ్యర్థాలు తరలిస్తున్న ఓ ట్యాంకర్‌ను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. దుండిగల్ పీఎస్ పరిధిలో బుధవారం రాత్రి రసాయనాల వ్యర్థాలు తరలిస్తున్న ఓ ట్యాంకర్ ఔటర్‌రింగ్ రోడ్డు సమీపంలోని సారెగూడెంలో పోలీసులు పట్టుకొని విచారించగా..ఎలాంటి ఆధారాలు లేకుండా రసాయనాలు తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. దీంతో లారీ ఓనర్ రమేశ్‌తోపాటు డ్రైవర్ చందర్‌పై కేసు నమోదు చేసి ట్యాంకర్‌ను జీడిమెట్ల పీసీబీ అధికారులకు అప్పగించారు.

శ్రీరామ్‌నగర్ కాలనీ అభివృద్ధికి కృషి

కొండాపూర్, జూలై 11: కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీ ఏ బ్లాక్‌లో తలెత్తిన పలు సమస్యలను కాలనీ అసోసియేషన్ పరిష్కార దిశగా చర్యలు చేపట్టడం అభినందనీయమని అసోసియేషన్ గౌరవ సలహాదారు చాంద్‌పాషా అభినందించారు. కాలనీలో స్కూల్ బస్సుల రాకపోకలకు ఇబ్బందిగా మారిన ర్యాంపులను తొలగించడంతోపాటు డ్రైనేజీ సమస్యలు, వర్షపు నీరు నిల్వకుండా పలు ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ చర్యలు తీసుకున్నది. కాలనీ అభివృద్ధిలో అసోసియేషన్ కీలకంగా వ్యవహరిస్తూ, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలువడం హర్షణీయమన్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, ఇతర సభ్యులు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు.

ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

కుత్బుల్లాపూర్, జూలై 11:కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో దూలపల్లిశివారు ఫాక్స్‌సాగర్ ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను, షెడ్లను గురువారం ఇరిగేషన్ విభాగం అధికారులు కూల్చివేతలు చేపట్టారు. పలు షెడ్లతో పాటు నిర్మాణాలు పూర్తిగా ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణకు గురై నిర్మాణాలు చేపట్టారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కూల్చివేతలతో ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు హెచ్చరికలు జారీ చేశారు.

సహృదయ వృద్ధాశ్రమంలో సరుకుల పంపిణీ

బాలానగర్, జూలై 11 : సహృదయ వృద్ధాశ్రమానికి చిమ్మపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందజేశారు. గురువారం చిమ్మపూడి ఫౌండేషన్ కార్యదర్శి అప్పాజీ శ్రీనివాస్ ఆశ్రమ ఇన్‌చార్జి హకీమ్, నస్రీన్‌లకు సరుకులు అందజేశారు. ఈ వారంలో సుమారు 60 ప్రాంతాల్లో నిర్వహించదల్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు రవికుమార్, కోశాధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్‌లో విజేత సూపర్ మార్కెట్ సీజ్

కొండాపూర్, జూలై 11 : కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రకాలనీలో అక్రమంగా నిర్మించిన భవన సముదాయంలోని విజేత సూపర్ మార్కెట్‌ను గురువారం జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. కొండాపూర్ రాజరాజేశ్వరీనగర్ సర్వే నంబర్ 78 నుంచి 93లో ఉన్న 0.36 గుంటల స్థలంలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు చింతల కుమార్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ విచారణ జరిపి.. అక్రమ నిర్మాణం కూల్చివేయాల్సిందిగా శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. కోర్టు ఉత్తర్వులపై స్థల యజమాని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాడు. కూల్చివేత ఉత్తర్వులపై సిటీ స్మాల్ కాసెస్ కోర్టు స్టేటస్ కో ఇచ్చింది. కోర్టు ఇచ్చిన స్టేటస్ కో వెకెట్ కాగా, జీహెచ్ఎంసీ అధికారులు సైతం సదరు అక్రమ నిర్మాణంపై రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. చివరకు స్టేటస్ కో వెకెట్ కావడంతో శేరిలింగంలిపల్లి సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ డీఈ విశాలాక్షి ఆధ్వర్యంలో విజేత సూపర్ మార్కెట్‌ను సీజ్ చేశారు.

'ఎన్ఎస్ఎల్'లో అక్రమ బ్లాస్టింగ్‌లు నిలిపివేయాలి

బాలానగర్, జూలై 11: కేపీహెచ్‌బీకాలనీ రోడ్డు నంబర్1 లో ఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రా టెక్ వెంచర్‌లో నిర్వహిస్తున్న అక్రమ బ్లాస్టింగ్‌లను తక్షణమే నిలిపివేయాలని కేపీహెచ్‌బీ పోలీసులకు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. గురువారం కేపీహెచ్‌బీకాలనీ పోలీసులను కలిసి అక్రమ బ్లాస్టింగ్ సమస్యపై పలువురు కాలనీవాసులు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎల్ ఇన్‌ఫ్రాటెక్ వెంచర్‌లో గత మూడు నెలలుగా అక్రమ బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంచర్‌కు తమ ఇండ్లు 10 నుంచి 50 మీటర్ల దూరంలో ఉన్నాయని, బ్లాస్టింగ్‌లతో వణుకు, పునాదులు కంపనాలు, భవనాలకు పగుళ్లు, కిటికీల అద్దాలు, శానిటరీ సామన్లు ధ్వంసమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మా ఇబ్బందులను వెంచర్ నిర్వాహకుల దృష్టికి తీసుకుపోయినా తమకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ బుకాయిస్తున్నారని పేర్కొన్నారు. పలుమార్లు డయల్ 100కు ఫోన్ చేసి సమస్య వివరించామన్నారు. ఈ సమస్యపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్, కూకట్‌పల్లి ఏసీపీ, పురపాలకశాఖ మంత్రి, కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్‌లకు కూ